

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## నిరుపేద తల్లిదండ్రుల కలలు నెరవేర్చడమే వీఆర్ హైస్కూల్ పున:ప్రారంభ లక్ష్యం

- వీఆర్ హైస్కూల్‌ను ఆకస్మికంగా పరిశీలించిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- మరో వారంలో వీఆర్ హైస్కూల్ పున:ప్రారంభం



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త -వైద్యం** నిరుపేద తల్లిదండ్రుల కలలు నెరవేర్చేలా వీఆర్ హైస్కూల్లో విద్య బోధన అధునాతన టెక్నాలజీతో అందించబోతున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం సాయంత్రం మున్సిపల్ కమీషనర్ నందన్, నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్‌లతో కలిసి మంత్రి నారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. హైస్కూల్లోని ప్రతి తరగతి గదిని క్షుణ్ణంగా పరిశీలించి వసతులపై ఆరా తీశారు. వేగవంతంగా పనులు చేస్తున్న ఎన్సీసీ వారిని మంత్రి అభినందిస్తూ.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే నెంబర్ వన్ హైస్కూల్‌గా వీఆర్ స్కూల్‌ను రూపుదిద్దబోతున్నట్లు తెలియజేశారు. గత ప్రభుత్వంలో మూతపడిన చరిత్ర కలిగిన వీఆర్ హైస్కూల్‌ను అధునాతన టెక్నాలజీతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ప్రస్తుతం 85 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 15 శాతం పనులు కూడా పూర్తి చేసి మరో వారంలో వీఆర్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించబోతున్నట్లు మంత్రి చెప్పారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 1000 మంది విద్యార్థులకు నాణ్యమైన అధునాతన టెక్నాలజీతో కూడిన విద్యను అందించబోతున్నట్లు తెలిపారు. విద్యతో పాటు విద్యార్థులకు ఉదయం టిఫన్ మధ్యాహ్నం భోజనం సాయంత్రం స్నాక్స్ ఇవ్వబోతున్నామన్నారు. అదే విధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు సమకాలికంగా ఉంటాయని తెలిపారు. వీటితో పాటు ఉచితంగా రవాణా సౌకర్యం కూడా ఉంటుందన్నారు. రానున్న ఏడాది 2000 మంది పేద విద్యార్థులకు వీఆర్ హైస్కూల్‌లో ప్రవేశం కల్పించబోతున్నట్లు స్పష్టం చేశారు. పేదలు, నిరుపేదల తల్లిదండ్రు కలలను నెరవేర్చేలా వ్యూహాత్మకంగా ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. వీఆర్ హైస్కూల్ ప్రారంభోత్సవం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా భగత్ సింగ్ కాలనీలో 1400 కుటుంబాలకు పట్టాలు పంపిణీ, స్మార్ట్ సిటీ కింద 164 మందికి షాపింగ్ కాంప్లెక్స్ మంజూరు ప్రక్రియ కూడా లాంఛనంగా ఉంటుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రెసిడెంట్లు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 14, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 95క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 38.355టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్సికి 350 , ఎన్ఎఫ్సికి 375 , పెన్నా డెల్టాకు 3850, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 93.738మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## కార్పొరేషన్ లో మెప్మా మహిళలు, అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

### మెప్మా రిసోర్స్ పెర్సన్స్ కు ట్యాబ్ లు పంపిణీ చేసిన మంత్రి



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 14 ప్రభాతవార్త:** డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చి పనితీరుని మెరుగుపరిచేందుకు ట్యాబ్స్ పంపిణీ చేసామని మునిసిపల్ మంత్రి నారాయణ తెలిపారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ లో జరిగిన సమీక్ష లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెప్మా మహిళల అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషిచేస్తున్నారని వివరించారు. వారందరినీ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనేది సీఎం సంకల్పించారని చెప్పారు. 28 లక్షల డ్వాక్రా మహిళల సాధికారతే మా ప్రభుత్వ లక్ష్యం పేర్కొన్నారు. గతంలో ఇసుక నిర్వహణ కూడా డ్వాక్రా మహిళలకే అప్పగించారు. 175 నియోజక వర్గాల్లో ఎమ్మెస్ ఎంఇలు ఏర్పాటు చేస్తున్నాంమని అన్నారు. ఖ్యాటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కాబోతోందన్నారు. రాష్ట్రాన్ని డిజిటల్ ఆంధ్రప్రదేశ్ చేయాలన్నది సీఎం కలన్నారు. రాష్ట్రంలో 60 డీజీ లక్ష్మీ సెంటర్ లు సేవలు అందిస్తున్నాయి తెలిపారు. యువనేత లోకేష్ వాట్సాప్ గవర్నెన్స్ నీ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలియజేసారు. రాష్ట్ర వ్యాప్తంగా రిసోర్స్ పెర్సన్స్ కి 9000 వేల ట్యాబ్ లూ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ని వాడితే నాలెడ్జి కూడా పెరుగుతుందని, సెల్ ఫోన్ వాడినంత సులభంగా ట్యాబ్ ని వినియోగించవచ్చుఅని, స్మార్ట్ స్ట్రీట్స్ పెడుతున్నాము వివరించారు. నెల్లూరులో వెయ్యి మంది మెప్మా మహిళలను వ్యాపారవేత్తలను చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,మెప్మా ఏ ఎం ఢీ వెంకటేశ్వర్లు ,ఎస్ ఎం ఎం శ్రీనివాసులు ,మెప్మా పీడీ లీలా రాణి ,టిట్కో ఎండీ,సునీల్ కుమార్ రెడ్డి ,కమిషనర్ నందన్ ,టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు .

## నీట్‌ఫలితాల్లో నారాయణ విజయధుందుభి



**నెల్లూరు,జూన్14 ప్రభాతవార్త-విద్య** శనివారం విడుదలైన నీట్ 2025 ఫలితాల్లో నగరంలోని స్థానిక నారాయన మెడికల్ అకాడమి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయధుందుబి మోగించారు. ఓపెన్ క్యాటగిరిలో ఎస్.ఇ కవిన్ 161 వ ర్యాంకు, పి.శ్రీరామ్253వ ర్యాంకు, ఎన్.యోగేష్ కార్తిక్ 323, ఎం.వెంకటశ్రీనివాస్515, ఎస్.వైష్టవ్‌కుమార్546, పి.లలిత్ శ్రీహాసన్563, ఎం.విశ్వక్955, టి.సుబాష్ శంకర్804 , పి.కత్రివేల్962 వ ర్యాంకులు సాధించి సత్తా చాటారు.ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో విద్యార్దులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యా సంస్థల జిఎం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతు తమ విద్యార్దులు జాతీయస్థాయి పరీక్షా ఫలితాల్లో అద్బుత ఫలితాలు సాధించటం గర్వకరాణమన్నారు. జాతీయస్థాయిలో 1000 లోపు 9మంది విద్యార్దులు ర్యాంకులు కైవశం చేసుకోవటం జరిగిందన్నారు. ప్రస్తుత సమాచారం మేరకు 600కు పైగా 9మంది, 550కి పైగా 32మంది, 500కి పైగా 74మంది, 450కి పైగా 172మంది సాధించటం జరిగిందని, ఇది తమకెంతొ గర్వకారణమన్నారు. తమ విద్యాసంస్థల్లో నిర్వహించే మైక్రో షెడ్యూల్స్, ప్రనాళిక బద్దమైన బోధనా పద్దతులు,అనాలిసిస్, పేపర్ డిస్కషన్, అత్యాధునిక సాంకేతికత వంటివి విజయానికి దోహదపడ్డాయన్నారు. విద్యార్దుల తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవటం జరిగిందన్నారు. అనంతరం ర్యాంకర్లకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్, కోర్‌డీన్స్, డిజిఎంలు, ఏజిఎంలు , ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం.. విద్యార్థులకు వరం

### ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం





**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త :** సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే విద్య ఒక్కటే ప్రధాన ఆయుధమని, మంచి విద్యాభ్యాసం అందిస్తేనే ఉత్తమ భావిపౌరులుగా తయారవుతారని, అలాంటి విద్యకు పెద్ద పీట వేస్తూ ఏ పిల్లవాడు కూడా విద్యకు దూరం కాకూడదన్న ప్రధాన లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. వీపీఆర్ నివాసంలో శనివారం తల్లికి వందనం పొందిన లబ్ధిదారులు వారి పిల్లలతో కలిసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఓ కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికి మాత్రమే ఈ పథకం వచ్చేదని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాలోకి నగదు జమ చేసేలా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గత వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి నేడు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం కార్యక్రమం అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్షలాది మంది కళ్లల్లో దీపావళి వెలుగులు నింపారన్నారు. 13 వేలు తల్లి ఖాతాలో పడితే 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులోకి పోతున్నాయని వైసీపీ నేతలు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పాఠశాల అభివృద్ధి కొరకు ఈ 2 వేలు ఆయా ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. గత వైసీపీ పాలనలో కూడా 13 వేలు ఇచ్చారని, అప్పట్లో 2 వేలు వైసీపీ నాయకుల జేబులోకి పోయాయా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 67.27 లక్షల విద్యార్థులకు తల్లికి వందనం వస్తుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుకునేందుకు దోహదపడే విధంగా నేరుగా విద్యార్థి తల్లి లేదా సంరక్షకుని ఖాతాలో డబ్బులు వేస్తుంటే దానిని స్వాగతించకుండా తప్పుడు ప్రచారాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు వైసీపీ ముందుందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ పాలనలో ఈ పథకం కోసం కేవలం 5 వేల కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు అందించే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పు, రాగిపిండిలో కూడా కమిషన్ తీసుకున్న చరిత్ర వైసీపీ నాయకులదే అన్నారు. చివరికి కోడిగుడ్లు, చిన్నారులు తాగే రాగి జావ గ్లాసులపై కూడా గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి బొమ్మ వేసుకున్న చరిత్ర అన్నారు. త్వరలోనే రైతుల సంక్షేమం కోసం ఏడాదికి 20 వేలు అందించే అన్నదాత సుఖీభవ ఈ నెలాఖరులోనూ, ఆగస్టు నెలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అదేవిధంగా బీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16 వేల పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తూ సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఊపిరి పోశారన్నారు. అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నారన్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేయడమే కాకుండా తమ ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమచేయడం ప్రస్తావిస్తూ ఆనందం వ్యక్తం చేయడమే కాకుండా ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు, తదితరులు ఉన్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

### శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు





**పెంచలకోన (రాపూరు), జూన్ 14, ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు పోటేత్తిపోయారు. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన 5వ శనివారం కావడంతో స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకోంది. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి,ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహ, వెంకటసుబ్బయ్య, తదితరులు



పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## రూరల్‌లో వైసీపీ పరిస్థితి అధోగతి

- నగర ఇంచార్జ్ ఎలా మార్చారు చెప్పండి
- కక్షపూరితంగానే సిటీ అధ్యక్షుడు మార్పు
- ఆనం విజయ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలి



**నెల్లూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త** నెల్లూరు నగర వైఎస్ఆర్సిపి అధ్యక్షుడిగా సన్నపురెడ్డి పెంచల్ రెడ్డి వైఎస్ఆర్సిపి రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. పాత విషయాలు మనసులో పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఆనం కుటుంబంతో సుదీర్ఘ రాజకీయాల్లో ఉన్న నన్ను కావాలనే పనిగట్టుకుని పార్టీ నుండి దూరం చేయాలని ఆనం విజయకుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నెల్లూరు నగరంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో ఆదాల ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. నాకు వైఎస్ఆర్సిపి నగర్ అధ్యక్షుడిగా పదవి ఇచ్చారని ఇప్పుడు ఆదాల ప్రభాకర్ రెడ్డి వైసీపీలోనే ఉన్నారని కనీసం ఆయన కూడా తెలుపకుండా నా పదవి ఎలా తీస్తారని ఆయన ప్రశ్నించారు. ఆనం కుటుంబంతో సుదీర్ఘంగా ప్రయాణించిన నేను గతంలో వారు పార్టీ మారిన సమయంలో జగన్మోహన్ రెడ్డి పై వైయస్ రాజశేఖర్ రెడ్డి పై అభిమానంతో ఈ పార్టీలోనే ఉన్నానని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆదాల ప్రభాకర్ రెడ్డినిగెలిపించేందుకు సకల ప్రయత్నాలు చేసిన నాపై కక్ష సాధింపుగానే ఆనం విజయ్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. గతంలో రూరల్‌లో బలంగా ఉన్న వైసిపి ఇప్పుడు ఆనం విజయకుమార్ రెడ్డి రూరల్ నియోజకవర్గం ఇన్చార్జిగా పదవి చేపట్టిన తర్వాత ఏ విధంగా ఉందో పార్టీ పెద్దలు తెలుసుకోవాలని హితవు పలికారు. కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన రూరల్ నాయకులను ఎవర్ని ఇప్పుడు ఆనం విజయ్ కుమార్ రెడ్డి పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. గతంలో నెల్లూరు రూరల్ లో వైసీపీ పార్టీ ఏ విధంగా ఉంది ఈరోజు పరిస్థితి ఏ విధంగా ఉందో పార్టీ పెద్దలే గమనించాలని ఆయన తెలిపారు. నిష్పక్షపాతంగా వ్యవహరించిన పార్టీ కార్యకర్తలను నాయకులను పూర్తిగా విస్మరించి వైసిపి రూరల్‌లో అద పతలనికి కూరుకునేలా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పనిచేస్తున్నారని ఇది గమనించకపోతే పార్టీ నెల్లూరు రూరల్ లేకుండా పోయే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య హత్య



**నెల్లూరు క్రైమ్, జూన్ 14, ప్రభాతవార్త** కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశానికి లోనైన భర్త తన భార్యను రోకలి బండతో తలపై మోది దారుణంగా హత్య చేసిన సంఘటన స్థానిక బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... స్థానిక బాలాజీ నగర్ గౌడ హాస్టల్ సమీపంలో లంక విజయచంద్ర, శైలజ (40) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. విజయ్ చంద్ర జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ వాదోపవాదాలు జరుగుతుండేవి. శనివారం కూడా ఇదే విధంగా భార్య భర్తల నడుమ ఘర్షణ తలెత్తడంతో కోపోద్రిక్తుడైన విజయ్ చంద్ర రోకలి బండతో భార్య తలపై గట్టిగా మోదాడు. దీంతో తీవ్ర రక్తస్రావానికి గురై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి నగర ఇన్చార్జి డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, బాలాజీ నగర్ సిఐ దశరథ రామారావు చేరుకున్నారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి సిఐ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

## జూన్ 21న జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహణ





**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 14, ప్రభాతవార్త** అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జిల్లావ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 21 యోగా దినోత్సవానికి ప్రజలను సన్నద్ధం చేసేందుకు శనివారం ఉదయం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ, ఎన్ సి సి విభాగం సంయుక్తంగా నిర్వహించిన సన్నాహక సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు, చిన్నారులు అందరూ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈ సన్నాహక సామూహిక యోగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించినట్లు చెప్పారు. జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిలో 7 వేల ప్రాంతాల్లో 124 మంది మాస్టర్ ట్రైనర్లు, 5000 మంది పైగా సచివాలయ యోగా అభ్యాసకుల చేత యోగా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ కూడా యోగాను ఒక దినచర్యగా మార్చుకోవాలనేది ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశంగా కలెక్టర్ చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. హరికృష్ణ, నోడల్ అధికారి, జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి యతిరాజ్, సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సుజాత, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఎస్ ఈలు వెంకటరమణ, అశోక్ కుమార్, మెప్మా పిడి లీలారాణి, యోగా గురువులు స్వప్న, ముత్యా ల రవీంద్ర, 24 ఆంధ్ర బెటాలియాన్ ఎన్‌సిసి విద్యార్థులు, మాజీ సైనికులు, పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## జిల్లా జైల్లో కాకాణిని పరామర్శించిన వైసీపీ నాయకులు



**నెల్లూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త :** నెల్లూరు సెంట్రల్ జైల్లో కాకాణి గోవర్ధన్ రెడ్డిని మాజీ ఎంపి అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నెల్లూరు చెముడుగుంటలోని జిల్లా సెంట్రల్ జైల్లోమాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ములఖత్ అయ్యి పరామర్శించారు. ఈ అక్రమ కేసు నుండి గోవర్ధన్ రెడ్డి గారు.. నిర్దోషిగా బయటికి వస్తారన్న విశ్వాసం పెద్దిరెడ్డి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డిమేరిగ మురళీ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి గార్లతో కలిసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. అందులో భాగంగా కాకాణి గోవర్ధన్ లాంటి సౌమ్యుడిపై అక్రమ కేసు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కోర్టులు కూడా అభ్యంతరం తెలియచేస్తున్న సెక్షన్లు బనాయించి ఈరోజు వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇలా కేసులు పెడితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడుతుందని.. కూట మినేతలు ఆలోచన అని అన్నారు. అక్రమ కేసులకు వైఎస్ఆర్సిపి భయపడదని, కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించే దుష్ట సంస్కృతిని కూటమి ప్రభుత్వం తెరమీదకి తీసుకొచ్చిందన్నారు. తప్పుడు కేసుల సంస్కృతి మంచి పద్ధతి కాదని ఎంతో మంది వారిస్తున్నప్పటికీ కూడా కూటమి.. వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు కొనసాగిస్తూనే ఉందన్నారు. ఇలాంటి దుష్ట సంస్కృతికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి వారిని వేధించడం అన్యాయం. ఎప్పుడూ లేని విధంగా పీటీ వారెంట్లు వేస్తూ వరస కేసులుతో గోవర్ధన్ రెడ్డిని అక్రమంగా నిర్బంధిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని పరిస్థితులు ఈ రాష్ట్రంలో చూస్తున్నాం. నేను ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఇలాంటి వ్యవహారం ఏ ముఖ్యమంత్రి చేయలేదు కచ్చితంగా దీనికి కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం ఉందా అన్న విధంగా పాలన సాగుతుంది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్యాంధ్రను నిర్మించడమే లక్ష్యం



**మనుబోలు జూన్ 14 ప్రభాతవార్త :** 21 వ అంతర్జాతీయ మోగా దినోత్సవం సందర్భంగా శనివారం నాడు కాగితాలపూర్ సచివాలయంలో యోగ ట్రైనర్ బోలా శ్రీను సిబ్బంది మరియు గ్రామ స్తుల చేత యోగాసనాలు చేయించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతు నిత్యం యోగా చేయడం వలన ఆరోగ్యంతోపాటు మానసిక బత్తిడిలను అధిగమించవచ్చునని తెలిపారు. కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాలు ఈకార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ సిహెచ్ చెంచమ్మ, మరియు సిబ్బంది టిడిపినాయకులు చల్లగిరి చిట్టిబాబు, గోను దాసయ్య, వి.దినేష్‌రెడ్డి, వేమా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో పలుఅవార్డులు

## ఆరోగ్యశాఖ మంత్రి చేతులమీదుగా పురస్కారాలు



**కావలి, జూన్14 ప్రభాతవార్త :** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో అవార్డుల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం కావలి రెడ్‌క్రాస్‌కు రాష్ట్రస్థాయిలో అవార్డులపంట పండింది. రక్తసేకరణలో ప్రతిభచూపిన పలు రెడ్‌క్రాస్ శాఖల రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ పురస్కారాలను అందచేశారు. 2023-24, 2024-25 సంవత్సరాలకుగాను కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం ద్వారా నిర్వహించిన శిబిరాలకు 5 అవార్డులు లభించాయి. 2023-24 సంవత్సరంలో ఒక్కరోజులో రక్తదాతలు సమీకరించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం పొందిన కావలి సీనియర్స్ వాలెంటరీ ఆర్గనైజేషన్ అద్యక్షుడు నల్లిపోగు ప్రణీత్ మంత్రి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. 2024-25 సంవత్సరంలో ఒక్కరోజులో అత్యధికంగా రక్తదాతలను సమీకరణలో ద్వితీయస్థానం సాధించిన కావలి ఐఎంఎ తరఫున డాక్టర్ టి.రమ్య పురస్కారాన్ని అందుకున్నారు. 2024-25 సంవత్సరంలో విద్యాసంస్థలలో అత్యధిక సంఖ్యలో రక్తదాన శిబిరం నిర్వహించి ప్రథమస్థానం సాధించిన కావలి విశ్వోదయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి తరఫున పరిపాలనాధికారి కె.రామకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 2023-24, 2024-25 సంవత్సరాలలో రక్తసేకరణలో కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం నాన్‌మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలలో ప్రథమస్థానం సాధించడంతో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్, కోశాధికారి ఆరికట్ల మధుసూధన్‌రావులు ఆర్థికమంత్రి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. కావలిలాంటి చిన్నపట్టణంలో రక్తదాన ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న కావలి రెడ్‌క్రాస్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్రఛైర్మన్ వై.డి.రామారావు, ప్రధానకార్యదర్శి ఎ.కె.పరిడా, కోశాధికారి పి.రామచంద్రరాజు, నెల్లూరుజిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, కావలి రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ కె.హరినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వరుసగా 8 సంవత్సరాలు ప్రథమస్థానంలో కావలి రెడ్‌క్రాస్ నిలిచేందుకు సహకరించిన కావలి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలకు, రెడ్‌క్రాస్ నాయకత్వానికి కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

## హవాలా నెల్లూరు జిల్లాలో హవాలా నగదు 3కోట్లు పట్టివేత

- జిల్లాలో సంచలనంగా మారిన వ్యవహారం





**మర్రిపాడు, ఆత్మకూరు, జూన్14, ప్రభాతవార్త:** ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం జిల్లా సరిహద్దు ప్రాంతంలో హవాలా తాలూకా కారులో తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. గుజరాత్ అహ్మదాబాద్‌కు చెందిన ఒక వ్యాపారి ఢిల్లీ కేంద్రంగా చెన్నైకి ఈనగదును కారులో తరలిస్తుండగా ఆ కారు డ్రైవర్ గుమస్తా తో కలిసి ఆ నగదును చోరీ చేయడం జరిగింది. దీంతో ఒక్కసారిగా నెల్లూరు జిల్లాలో ఈ వ్యవహారం తీవ్ర సంచలనం కలిగించింది. గుజరాత్ వ్యాపారి ఢిల్లీ కేంద్రంగా ఈకార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు పోలీసు వర్గాలకు సమాచారం అందింది. గత రెండురోజుల క్రితం మధ్యప్రదేశ్ కు చెందిన టిఆర్ఇ రిజిస్ట్రేషన్ కారులో 4కోట్ల 50లక్షల రూపాయల నగదును చెన్నైకి తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఆకారు జిల్లా సరిహద్దు ప్రాంతంలోని ప్రాంతానికి చేరుకునే సమయంలో జిపిఎస్ సిగ్నల్ కట్ కావడం, కారు డ్రైవర్, కారులో ఉన్న గుమస్తా ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కంగారు చెందిన వ్యాపారి తనకున్న పలుకుబడితో జిల్లా పోలీసు యంత్రాంగానికి ఈ భారీ నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. వ్యాపారి దగ్గర పనిచేస్తున్న కారు డ్రైవర్, గుమస్తా తమ అనుచరులకు ముందుగానే సమాచారం ఇవ్వడంతో పథకం ప్రకారం ఈ కారును కడప జిల్లా నుంచి నాలుగు కారులు వెంబడిస్తూ జిల్లా సరిహద్దు ప్రాంతం వద్ద నగదు తరలిస్తున్న వాహనాన్ని అటకాయించినట్లు సమాచారం. 4.50కోట్ల రూపాయలను వెనుకొని మరో సరిహద్దు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో సంచరిస్తూ కారును బాట, సింగనపల్లి ప్రాంతంలోని రహదారిపై వదిలి వెళ్ళారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈచోరీ వ్యవహారంపై విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.ఇద్దరు డియస్పీలు, 3సిఐలు, ఆరు మంది ఎస్ఐలతో విస్తృతంగా నిందితుల ఆచూకీకి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 5మంది నిందితులను గత రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి 3కోట్లరూపాయలుపైగా హవాలా నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సింగనపల్లి, భీమవరం రెవెన్యూ కార్యదర్శుల రాజశేఖర్, నవీన్ సమక్షంలో ఉన్నతాధికారులు ఈ డబ్బును పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి 4.50కోట్ల రూపాయలు చోరీ జరిగిందని ఫిర్యాదు అందగా నిందితుల నుండి 3కోట్ల రూపాయలు మాత్రమే లభ్యమైంది. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం ఈ హవాలా తాలూకా నగదు వ్యవహారం ఎంతకాలం నుండి జరుగుతుందని ఏ వ్యాపార వర్గం ఈ లావాదేవీలు జరుగుతున్నాయని లోతైన సమాచారం కోసం పోలీసులు అదుపులో ఉన్న నిందితులను విచారిస్తున్నట్లు సమాచారం. మొత్తంగా జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మర్రిపాడు పోలీస్‌స్టేషన్ వేదికగా ఈ వ్యవహారం జరగడం జిల్లాలో తొలిసారిగా నెల్లూరు-ముంబాయి రహదారిపై జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఈ వ్యవహారం చోటు చేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా ఈ వ్యవహారం పట్టివేత పై తీవ్ర స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన విషయాలన్నింటిని జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత గోప్యంగా ఉంచింది. సమాచారం ఇవ్వని పోలీసు అధికారులు హవాలా తాలూకా భారీ నగదు రవాణా, పట్టివేతపై పోలీసు అధికారుల ద్వారా సమాచారాన్నిసేకరించేందుకు విలేకర్లు ప్రయత్నించగా వారు స్పందించకపోవడం గమనార్హం.



## ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్

- సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి






**బుచ్చి జూన్ 14 ప్రభాతవార్త :** ప్రపంచంలో బారతదేశం నాలుగవ ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఈరోజు అవతరించందని ఆర్‌టిసి నెల్లూరు రిజీయన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రశంసించారు. బుచ్చిరెడ్డి పాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమం సందర్బంగా అతిధిగా పాల్గోన్న ఆయన మాట్లాడుతు విద్యార్దులు చక్కగా చదువుకొని దేశం కోసం అనేక కొత్త ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. ఈ పాఠశాల 35 సంవత్సరాం నుండి విద్యార్దులను క్రమశిక్షణ దేశభక్తి చక్కటి విద్యను అందిస్తుందని ఈ సందర్బంగా తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్దులందరు ముందుగా యోగాసనాలు ప్రధర్శించారు. తడాసన్,అర్ధకటి చక్రాసన్, పద్మాసన్, పశ్చమోతానసం ప్రదర్శించారు. అనంతరంగత సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్దులకు ఉత్తమ విద్యార్ది పురస్కారాలు పుస్తకాలు 30 వేల రూపాయాలు విలువైన వస్తువులను అందజేశారు. ఈకార్యక్రమంలో స్దానిక తెలుగుదేశం నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్ర పతి అవార్డు గ్రహీత గుండ్ర శ్రీనివాసులురెడ్డి, కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, ప్రిన్సిఫాల్ సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## గంజాయి ముఠా అరెస్ట్

- 3 కిలోల గంజాయి స్వాధీనం



**నెల్లూరు క్రైమ్, జూన్ 14, ప్రభాతవార్త:** చెడు వ్యసనాలకులోనై గంజాయి అక్రమ రవాణా బాట పట్టారు, చివరికి పోలీసులకు చిక్కారు. ఒరిస్సా ప్రాంతం నుండి జిల్లాకు గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు జరిపే ముగ్గురు సభ్యుల ముఠాను సంతపేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంతపేట పోలీస్ స్టేషన్ సిఐ దశరద రామారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నగరంలోని మూలాపేటకు చెందిన పసుపులేటి రాజేష్ తన స్నేహితులైన చెన్నై జాఫర్ పేటకు చెందిన ఆత్యల జేమ్స్, స్థానిక కుక్కల గుంతకు చెందిన పసుపులేటి వెంకట హరీష్‌ల చేతికి నగదు ఇచ్చి వారిద్దరి చేత ఒరిస్సా రాష్ట్రం నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేయించి నగరానికి తీసుకొస్తుంటాడు. తీసుకొచ్చిన గంజాయిని ముగ్గురు కలిసి నగరంలో విక్రయాలు చేస్తుంటారు. ఈ క్రమంలో శనివారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ పడమర మార్గం వైపు ఉన్న కారు పార్కింగ్ సమీపంలో ఒరిస్సా నుంచి తీసుకువచ్చిన గంజాయిని ముగ్గురు కలిసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ దశరథ రామారావు తమ సిబ్బందితో కలిసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు రూ. 60వేలు విలువచేసే 3 కిలోల గంజాయి ప్యాకెట్లను, ఒక యాక్టివా స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ దశరథ రామారావు తో పాటు ఎస్సై బాలకృష్ణ, ఏఎస్ఐ శ్రీహరి, హెచ్ సి లావణ్య కుమార్, పీసీలు షేక్ అల్లాబక్షు, సురేంద్రబాబు, సుదర్శన్ గౌడ్‌లను ఎస్పీ అష్ట కాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

## దివ్యాంగుల కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాలలో నిర్మాణాలు చేపట్టాలి



**కావలిరూరల్, జూన్14 ప్రభాతవార్త :** కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీలోని దివ్యాంగులకు ఇచ్చిన స్థలాలు కొన్ని ఖాళీగా ఉన్నాయని, త్వరలో ఖాళీస్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అద్యక్షులు, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాద్యక్షులు మండవ వెంకటరావు తెలియచేశారు. మండవ వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగుల కాలనీల్లోని దివ్యాంగులకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కాలనీల్లోని స్థలాలను కొంతమంది బైటవ్యక్తులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు కడుతూ, అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలియచేశారు. వారిపై అధికారులు చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించాలని ప్రభుత్వ అధికారులను కోరడం జరిగిందని తెలిపారు. పట్టాలులేని దివ్యాంగులకు పట్టాలు లేదా పొజిషన్ సర్టిఫికెట్టు అందచేసి గృహనిర్మాణానికి సహకరించాలని కోరారు. కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, విధ్యుత్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. 2016 చట్టం ప్రకారం దివ్యాంగుల కాలనీల్లో అక్రమకట్టడాలను కట్టినవారిని ఎమ్మెల్యే, ప్రభుత్వాధికారుల ద్వారా బయటకు పంపించాలని, అలా పంపించని యెడల దివ్యాంగులు కలిసికట్టుగా ఉద్యమం చేపట్టడం జరుగుతుందని తెలియచేశారు. దివ్యాంగుల సమస్యలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సేవలు అందిస్తా : ఆలయ అధికార చంద్రశేఖర్

## అన్నదానకార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించిన డీసీ

**వలేటివారిపాలెం జూన్ 14 ప్రభాతవార్త :** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారి భక్తులుకు మెరుగైన సేవలు అందించెందుకు శాయశక్తులా కృషిచేస్తానని నూతనంగా విధులో చేరిన డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్ అన్నారు. ఇందుకు సహకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తిచేశారు. ఇటీవల భక్తుల రద్దీ దృష్ట్యా బఫే పద్దతిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 7న దేవాదాయశాఖా మంత్రి ఆనం నారాయణ రెడ్డి స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మరియు స్టేట్ దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్రరావు గారితో కలిసి అన్నదాన నిర్వహణను నిశితంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన పత్రికాసమావేశంలో అన్నదాన నిర్వహణాతీరును తప్పుపట్టారు. అసహనం వ్యక్తం చేశారు. బఫేపద్ధతిని ఆక్షేపించారు. అడిగిన ప్రతి భక్తుడికి లేదనకుండా కాదనకుండా అరటాకులో నాణ్యతాప్రమాణాలతో కూడిన టేబుల్ భోజనం వడ్డించాలని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది కొరతను సైతం మీడియా ప్రతినిధులు సూచించారు. ఈ విషయమై వార్త దినపత్రికలో ఈ నెల 10న మాలకొండలో టేబుల్ బోజనంపై చేతులెత్తేసిన అధికారులు అనుశీర్షికతో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మంత్రి జరుగుతున్న సాదారణబదిలీల ప్రక్రియలో ఆలయ డీసీ సాగర్‌బాబుని బదిలీ చేశారు. ఈయనతోపాటు మరో ముగ్గురు సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించారు. వీటితో పాటు అన్నదాన కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. దీంతో శనివారం అన్నదాన కార్యక్రమంపై డీసీ చంద్రశేఖర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. అన్నదాన కళ్యాణమండపంలో భక్తులకు టేబుల్ భోజనం ఏర్పాటు చేశారు. తొలిపంక్తిలో ఆయన ఆహారపదార్ధాలు వడ్డించారు. పలువురు భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇటీవలనే మాలకొండ వచ్చానన్నారు. స్వామివారి దర్శనం అందించడంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కోన ప్రసాద్‌తోపాటు పలువురు భక్తులు, సేవకులు ఉన్నారు. మాలకొండ దేవాలయ భక్తులకు మెరుగైనసేవలు అందించడానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంత్రిని కమీషనర్‌ని పిలిపించి తగిన చర్యలు కోసం చేస్తున్న కృషిని పలువురు ప్రశంసిస్తున్నారు.

## పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



**నెల్లూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త ;** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 16 మందికి 14 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతులమీదుగా అందించారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారిందని రూరల్ ఎమ్మెల్యే కొట్టం రెడ్డి శ్రీధర్ రెడ్డిరెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 16 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. దీర్ఘకాలంగా బాధపడుతూ ఆరోగ్యశ్రీకి అనర్హులైన పేద వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక సంజీవని అని ఆయన అన్నారు. కోటకు ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోటి 35 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు అందించని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కస్టర్ ఇన్చార్జీలు కార్పొరేటర్స్ డివిజన్ అధ్యక్షులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదలీ అయిన అధికారులకు ఘన సన్మానం



**బుచ్చి జూన్ 14 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం రెవిన్యూ కార్యాలయం నుండి బదలీ అయిన అధికారులను తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. డిప్యూటి తహసిల్దారు సునీల్‌కుమార్ స్పెషల్ కలెక్టర్ తెలుగుగంగ ప్రాజక్టు నెల్లూరుకి బదలీ అయ్యారు. పి.కామాక్షి రీ సర్వే డిప్యూటి తహసిల్దారుగా పదోన్నతిపై స్పెషల్ కలక్టర్ తెలుగుగంగ ప్రాజక్టు నెల్లూరుకి, రెవిన్యూ ఇనస్పెక్టర్ రమణయ్య ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కోవూరుకి బదలీ అయ్యారు. కె.వి రాం మోహన్‌రావు,ఎ.ఎస్.ఓ కోవూరుకి బదలీ కాగా వీరందర్ని తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, విఆర్‌ఒలు,కార్యలయం సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ డాక్టర్ బాలచెన్నయ్య మృతి బాధాకరం



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు జడ్పీ చైర్మన్‌గా వైద్యుడిగా జిల్లా ప్రజలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న దళిత నేత డాక్టర్ బాలచెన్నయ్య సేవలు మరువలేనివని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆనం కుటుంబ ఆత్మీయుడు డాక్టర్ బాలచెన్నయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ బాలచెన్నయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆనం తెలియజేశారు.

## తల్లికివందనం నిధులు పడడంతో పాలాభిషేకం



**కావలి, జూన్14 ప్రభాతవార్త :** కూటమి టిడిపి ప్రభుత్వం పాఠశాలలు రీఓపెన్ సమయంలో తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాల్లో జమకావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిల చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. కావలి టిడిపి నాయకుడు తిరివీధి ప్రసాద్ ఆధ్వర్యంలో 20వ వార్డులో వార్డు ఇన్‌చార్జి పెంచలయ్యతో కలిసి నేతలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరివీధి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అమ్మఒడిపేరుతో ఇంటికి ఒకరికి మాత్రమే నిధులు ఇచ్చేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పాఠశాలలు ప్రారంభమైన రోజునే ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 13వేల రూపాయలచొప్పున తల్లుల ఖాతాలో జమచేయడంతో మహిళలు, విద్యార్థులు ఆనందాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేతలప్రభుత్వమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన హామీలను నెరవేరుస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారన్నారు.

## రేబాల సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమం



**బుచ్చి జూన్ 14 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల గ్రామంలో పంచాయితీలో ఇంటర్నేషనల్ యోగా డే ప్రోట్ కాల్ కార్యక్రమం సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పో రేషన్ ఇడి నిర్మలాదేవి, బుచ్చి ఎంపిడిఒ నారాయణరెడ్డి, తహసిల్లారు అంబటి వెంకటేశ్వర్లు,హౌసింగ్ ఏఇ పెంచలయ్య, సచివాలయ కార్యదర్శి ఎండి జలీల్ పాల్గోన్నారు. యోగా మాష్టార్లు జె .రాజేంద్రకుమార్, వెంకటలక్ష్మీ, పాల్గోన్నారు. ఈ సందర్బంగా యోగా మాష్టార్లు యోగా యొక్క ఉపయోగాలు గురించి వివరించారు. ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా చేయాలని సూచించారు. ఈ సందర్బంగా అధికారులు,సచివాలయ సిబ్బంది పలు ఆసనాలు వేశారు.

## రాజధాని నిర్మాణ పనులలో వేగం పెంచుతాం



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త–వైద్యం :** అమరావతి రాజధాని నిర్మాణ పనులలో వేగం పెంచుతామని రాష్ట్ర పురపాలక, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నా పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వ పనితీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని చెప్పారు. తిరుపతి సమీపంలోని రామాపురం వద్ద లెగసీ వేస్ట్ ప్లాంట్‌ను మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేషన్ అధికారులతో కలిసి శనివారం ఉదయం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి 10 లక్షల కోట్ల అప్పులు వదిలి వెళ్ళడం మాత్రమేనని ఎద్దేవ చేశారు. ఏపీలో 85 లక్షల టన్నుల చెత్తను వైఎస్సార్‌సీపీ వదిలేస్తే తమ ప్రభుత్వం ఏపీని స్వచ్ఛాంధ్రగా మారుస్తుందన్నారు. మచిలీపట్నంలో సీఎం ప్రకటన చేసిన విధంగా అక్టోబర్2వ తేదీకి 85 లక్షల టన్నుల చెత్తను ఎరువుగా మారుస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇప్పటి వరకు 50 లక్షల టన్నుల చెత్త తొలగించామన్నారు. మరో మూడు నెలల్లో 35 లక్షల టన్నుల చెత్త తొలగించాలన్నారు. తిరుపతిలో రోజుకు 2500 టన్నులు చెత్త ప్రాసెస్ చేయాల్సి ఉంటే కాంట్రాక్ట్ సంస్థ 900 టన్నులుమాత్రమే ప్రాసెస్ చేస్తోందన్నారు. అదనంగా మరిన్ని యంత్రాలు పెట్టి చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్‌సిక్స్‌ను అమలు చేస్తున్నామన్నారు. పెన్షన్లను 4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నిన్న ఒక్క రోజే 10 వేల కోట్ల రూపాయలు తల్లికి వందనం ద్వారాఖాతాల్లో జమ చేయటం జరిగిందన్నారు. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు. మహిళలకు ఆగష్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తామని తెలిపారు. అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు 2 లక్షల 20 వేల మందికి ప్రతి రోజు భోజనం అందిస్తున్నామని చెప్పారు. టిడ్కో బాధితులను ఆదుకుంటామని చెప్పారు. ఏసీ రూమ్స్‌లో కూర్చుని మాట్లాడటం కాదని, రాజధానికి వచ్చి జరుగుతున్న పనులు చూడాలని విమర్శకులకు చురకలు అంటించారు. జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజుల వ్యాఖ్యల వెనుక జగన్‌మోమన్‌రెడ్డి ప్రమేయం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్, సిబ్బంది, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## బారాషాహీద్ దర్గా అభివృద్ధికి 5 కోట్లు



**నెల్లూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు కుల మతాలకు అతీతంగా విచ్చేసే బారాషాహీద్ దర్గా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు కోసం ఐదు కోట్లు విడుదల చేసింది. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకరించరా రాష్ట్ర విగ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌కి కూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలకి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశ విదేశాల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఆటంకం కలక్కుండా వసతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే తెలిపారు. బారా షాహిద్ దర్గా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని ఆయన తెలిపారు.

## నవదంపతులకు జనసేన నాయకుల బహుమతి



**సీతారామపురం జూన్ 14 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వడ్డిపల్లి శ్రీనివాసులు సోదరి వడ్డిపల్లి సప్న పెళ్ళి వేడుకల సందర్భంగా పెళ్ళి ఖర్చుల నిమిత్తం నాసేవ కోసం నావంతు రాష్ట్ర కమీటి మెంబర్ జనసేన ఉదయగిరి నియోజకర్గ నాయకుడు బోగినేని కాశీరావు ఆర్థిక సహాయారంతో పెళ్లి కుమార్తె స్వప్న చేతికి పెళ్లి ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయాలను మండల జనసేన వీర మహిళ బోగినేని సులోచినమ్మ మండల జనసేననాయకులు కాశీరత్తలయ్యాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కరుణాకర్‌రెడ్డి, వార్డు మెంబర్ తోట మనోజ్, కొత్తపల్లి జగదీష్,తోట నవీన్ తదితరులు పాల్గోన్నారు.

## కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలుచేయాలి



**బిట్రగుంట జూన్ 14 ప్రభాతవార్త:** రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కావలి డివిజన్ సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య డిమాండ్ చేశారు. మండల సిపిఎం కార్యాలయం లో శనివారం విలేకరుల సమావేశం లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల సమయంలో చేసిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగభృతి ,యేటా ఉద్యోగాలు భర్తీ, ఇంటినివేశస్థలాలు వంటి హామీలు అమలు కాకపోగా విద్యుత్ చార్జీలు పెంపు వంటి అదనపు భారాన్ని మోపుతున్నరన్నారు. తక్షణమే హామీలు అమలుకు చర్యలు చేపట్టకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశం లో సిఐటియు మండల కార్యదర్శి సి. నరహరి, అన్వర్ బాషా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రామలింగాపురం అండర్ బ్రిడ్జి రోడ్డును వెంటనే మరమ్మత్తులు చేయాలి



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం** : రామలింగాపురం అండర్ బ్రిడ్జి పరిసర రహదారి భాగా దెబ్బతిన్న కారణంగా వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వాహనాలు స్కిడ్ అవుతూ ప్రమాదాలకు గురవుతున్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కారణంగా నీరు నిల్వ ఉండటం వల్ల రోడ్డు మరింత జారుడు మారిపోయింది. దీని వల్ల ఇప్పటికే కొన్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రజల ప్రాణాలతో ఆటలాడే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంత ద్వారా ప్రతి రోజు కొన్ని వేల వాహనాలు, స్కూల్ పిల్లలు, వృద్ధులు, ఉద్యోగులు ప్రయాణిస్తున్నారు. ఇలాంటి సమయంలో సంబంధిత ఆర్అండ్బి శాఖ/ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి, రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలి. తాత్కాలికంగా గుంతలు పూడ్చడమే కాకుండా, దీర్ఘకాలిక పరిష్కారం కోసం రోడ్డు పునరుద్దరణ చేయాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వల్లే ఈ సమస్య మరింత ముదిరింది. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు వెంటనే సైట్ను పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రజలు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండి, తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని చిలకా ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## పురుగు మందు తాగి మహిళ మృతి

**జోరేపల్లి(రాపూరు),జూన్14ప్రభాతవార్త** : మండలంలోని జోరేపల్లి గ్రామానికి చెందిన దాసరి కామాక్షమ్మ(50),పురుగుమందు తాగి మృతి చెందినట్లు రాపూరు ఏఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపారు. మృతురాలు కుటుంబసభ్యులతో వివాదాల నేపథ్యంలో శుక్రవారం రాత్రి పురుగు మందు సేవించిందన్నారు. చికిత్స నిమిత్త కుటుంబసభ్యులు రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకోని వచ్చి అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందిందన్నారు. ఈ మేరకు కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఆరోగ్యకర జీవన విధానానికి మార్గం యోగ



**వింజమూరు, జూన్ 14, ప్రభాతవార్త** : ఆరోగ్యకర జీవన విధానానికి సరైన మార్గం యోగ అని ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నల్లగొండ గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది గ్రామస్తులు ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది శారీరక ఆరోగ్యకరమైన అంశంగా చెప్పవచ్చునన్నారు. యోగాతో మానసికమైన ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. ప్రశాంత జీవన విధానానికి ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేందుకు యోగ ఉపయోగపడుతుందన్నారు. సోలో ఆసనాలు ప్రాణాయామము సూర్య నమస్కారాలు తదితరాలుగా యోగా వల్ల ప్రయోజనం పొందవచ్చు అన్నారు. అదే విధంగా యోగా అనేది పురాణ కాలం నుండి వస్తుందని నాడు మహర్షిలో ధ్యానాన్ని అలవర్చుకొని భగవంతుని దర్శించుకోగలిగారన్నారు. అంతటి మహిమ కలిగినదైనా ధ్యానము యోగా ప్రతి ఒక్కరూ అలవర్చుకుని సాధన చేయాలన్నారు. ధ్యాన సాధన అలవర్చుకుంటే అది నిత్యం మన వెంటే ఉంటుందని మరిచిపోని విధంగా ఉంటుందన్నారు. మానవునికి తాత్వికమైన ఆలోచనలు ఆధ్యాత్మికమైన మార్గానికి పునాది పడుతుందని ఆయన తెలిపారు. కావున యోగా అనేది ప్రతి ఒక్క వ్యక్తి అలవర్చుకోవాల్సిందన్నారు. ఆయన తో పాటు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కావలిలో రాష్ట్రషస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు




**కావలి, జూన్14 ప్రభాతవార్త** : కావలి బృందావనం హౌసింగ్కాలని కళ్యాణమండపంలో ఈ నెల 22వ తేది "మిస్టర్ సింహపురి స్టీల్మెన్ బాడీబిల్డింగ్ ఛాంపియన్షిప్" రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం కావలి క్రంచ్ ఫిట్నెస్ జిమ్లో ఏర్పాటుచేసిన సమావేశంలో నెల్లూరుజిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.జగన్, గౌరవ సలహాదారులు బుర్లా శ్రీధర్రెడ్డిలు మాట్లాడారు. నెల్లూరుజిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ ఛాంపియన్షిప్ పోటీలలో మహిళల ఫిజిక్ మోడలింగ్కు విశేష ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. పోటీలను పది విభాగాలలో 50 కిలోల నుండి వివిధ వెయిట్ క్యాటగిరిలలో నిర్వహిస్తారన్నారు. మహిళలలో బాడీబిల్డింగ్పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో, అంతర్జాతీయ క్రీడాకారిణిలు సంధ్యానడక్ (మిస్ ఏషియా, మిస్ వరల్డ్, మిస్ ఇండియా ఫెడరేషన్ గోల్డ్ మెడలిస్ట్), తమిళనాడుకు చెందిన సనాస్బేగ్ ఫిజిక్ మోడలింగ్ డెమో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, కవితలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. బాడీబిల్డింగ్ ఔత్సాహికులందరూ ఈ అపూర్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## యోగా దినచర్యలో ఒక భాగం కావాలి



**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : సంపూర్ణ ఆరోగ్య రక్షణకు యోగా ఎంతో ఉపయోగకరమని , ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో ఒక భాగంగా చేసు కోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రానున్న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు, మండల అధికారులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన నిత్యం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందన్నారు. కోవూరు మండల పరిదిలోని అన్ని సచివాలయాల్లో శనివారం యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. రోజూ ప్రాణాయామం , ధ్యానం చేయడం వలన ఒత్తిడి దూరం అవుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి తెలిపారు. యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులు న్యాయవాది సలీమ్, సుకుమార్లు యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు.

## ఊటు కాలువ పూడిక తీత పనులకు శ్రీకారం



**చేజర్ల జూన్ 14 ప్రభాతవార్త** : మండలకేంద్రమైన చేజర్ల పెద్ద చెరువు కింద ఉన్న రైతులకు సంబందించి పంట పొలాలకు ఉపయోగపడే ఊటు కాలువ పూడికతీత పనులకు శనివారం శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా కాలువ పూడికతీతో నిండిపోవడంతో రైతులకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు గురవుతున్న నేపద్యంలో కూటమి ప్రభుత్వం నిదులు మంజూరు చేసి రైతులకు మేలు చేకూరుస్తుంది. ఈకార్యక్రమంలో టిడిపి నాయ కులు రావి లక్ష్మీనరసారెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, సోమశిల దక్షణ కాలువ చైర్మన్ రావి ప్రసాద్రెడ్డి, చేజర్ల పెద్ద చెరువు చైర్మన్ అరవ గోపిరెడ్డి టిడిపినాయకులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర పైన అవగాహనా



**బిట్రగుంట జూన్ 14 ప్రభాతవార్త:** బోగోలు మండలపరిషత్ కార్యాలయం లో శనివారం యోగాంధ్ర కార్యక్రమం పైన అవగాహన కలిగించారు. యోగ గురువు అరుణకుమారి కార్యా లయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీల ప్రతినిధుల చేత యోగాసనాలు వేయించి యోగావిశిష్టతను తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ సురేష్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్ ఎం. నాగేశ్వరరావు, మాజీ ఎంపిటీసీ చిలకపాటి. వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షి నగర్లో నేత్రదానం



**విడవలూరు, జూన్ 14, ప్రభాతవార్త** : మండల కేంద్రం కామాక్షి నగర్ కాలనీలో కూలీ పనులు చేసుకుంటున్నా పోట్లపూడి సుబ్బరామయ్య (67) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందగా విడవలూరు మనసేవా సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ళ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సహకారంతో మృతుడు నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్కి దానం చేశారు. నేత్రాలను ఐ టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించినారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యాబోధన



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 14, ప్రభాతవార్త** : ఉత్తమ విద్యాబోధనే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరును మెరుగుపరుస్తున్నామని నెల్లూరు అర్బన్, రూరల్ మండల విద్యాశాఖ అధికారి బి.తిరుపాలు తెలియజేశారు. నెల్లూరులోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల్లో, అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ ఏడాది విద్యాబోధనలో సమూల మార్పులు చేశామని వివరించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్కు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలియజేశారు. 60 మంది కన్నా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్స్గా అప్గ్రేడ్ చేశామని చెప్పారు. అంతకన్నా తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా పరిగణించడం జరిగిందన్నారు. నెల్లూరు మున్సిపాలిటీలో 24 మోడల్ ప్రైమరీ స్కూల్స్ను, నెల్లూరు రూరల్ మండలంలో 11 ప్రైమరీ స్కూల్స్ను మోడల్ ప్రైమరీ స్కూల్స్గా గుర్తించామని చెప్పారు. ఉత్తమమైన విద్యాబోధనకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి కొరత లేదన్నారు. తమ పరిధిలోని మున్సిపల్ స్కూళ్లలో బదిలీ పక్రియ పూర్తయిందని, రూరల్ మండలంలో పూర్తి కావాల్సి ఉందని తెలియజేశారు. తరగతి గదుల కొరత ఉన్న పాఠశాలలకు నిధులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తింపు ఉన్న పాఠశాలల్లో తమ పిల్లలను చేర్చి భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా చూసుకోవాలని అన్నారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులందరికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగ్లు, షూస్, యూనిఫామ్ అందిస్తున్నామని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి అందిస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయడం జరుగుతుందన్నారు.

## వరుస చోరీలు.. భయాందోళనలో ప్రజలు



**వింజమూరు, జూన్ 14, ప్రభాతవార్త** : వింజమూరు మండలంలో ఇటీవల వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతూ దొరికిన కాటికి దోచుకుంటున్నారు. శుక్రవారం రాత్రి నందిగుంట గ్రామంలో అమర్లపూడి మాల్యాద్రి నివాసంలో దొంగలు ఇంట్లోకి చొరబడి 15 సవర్ల బంగారం, 50 వేల రూపాయల నగదును దొంగిలించికెళ్లారని యజమానురాలు వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాను పగులగొట్టి నగదు నగలను దోచుకెళ్లారని వారు వాపోయారు. చోరీ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వీర ప్రతాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి క్లూస్ టీంను చోరీ జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల నందిగుంట ప్రాంతంలోనే చోరీ జరగడంతో ఆ ప్రాంత నివాసులు కంటి మీద కునుకు లేకుండా దొంగల భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

## కమనీయం.. సీతారాముల కళ్యాణం




**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో ధ్వజ స్తంభం ఏర్పాటు చేసి రెండవ వార్షికోత్సవ సందర్భంగా శనివారం సీతారాముల కళ్యాణం కార్యక్రమాన్ని కడుకమనీయంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుత్వికులు అప్పలాచారి స్వామి, సత్యనారాయణ స్వామి, పడవల జనార్ధన్లు సీతారాముల కళ్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కళ్యాణ వేడుకలను సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా ఉభయకర్తలు తగు చొరవ తీసుకున్నారు. సీతారాముల కళ్యాణాన్ని కనులారా చూసినా.. చెవులారా విన్నా మంచి జరుగుతుందని ఈ సందర్భంగా రుత్వికులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వార్త శ్రీనివాసులు, నరసమ్మ, వార్త వెంకటేశ్వర్లు, పావని,దంపతులు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒకరికి రక్తదానం మరొకరికి ప్రాణదానం



**వింజమూరు, జూన్ 14, ప్రభాతవార్త** : ఒకరికి రక్తదానం చేసినట్లయితే మరొకరికి ప్రాణదానం చేసిన దానితో సమానమని విశ్రాంత డీఎంహెచ్ఓ కే.మాశిలామణి తెలిపారు. శనివారం స్థానిక వైద్యశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురష్కరించుకుని అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ కారల్ లెండ్ జన్మదినాన్ని పురష్కరించుకుని రక్తంలో ఏబీఏబీఓ, ఆర్హెచ్ రక్త గ్రూపులును కనిపెట్టడం జరిగిందన్నారు. రక్తం యొక్క ఆవశ్యకత రక్తం కృత్రిమంగా తయారు చేసుకొనుటకు వీలు కాదని కావున మనిషి రక్తం మనిషికి సరైన సరిపడు గ్రూపుతోనే దానం చేయాలని తెలిపారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసు గల వారు రక్తదానం చేయవచ్చు అన్నారు. ఎలాంటి భయం కానీ సందేహం కానీ వలదన్నారు. 300 నుండి 450 మి.లీల రక్తంను మూడు నెలలకు ఒక సారి ఇవ్వవచ్చని తెలిపారు. రక్తం వచ్చిన తర్వాత నాలుగు నుండి ఐదు రోజుల్లోనే తిరిగి రక్తం తయారవుతుందని తెలిపారు. రక్తదానం చేయడం వలన గుండె పోటు రాదని, రక్త ప్రసరణ చక్కగా ఉంటుందని రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుందని కిడ్నీ సమస్యలు దూరమవుతాయని తెలిపారు. కావున రక్తదానం మనిషి ఆరోగ్యానికి హాయిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రోగులు తదితరులు ఉన్నారు.

## భారీస్థాయిలో అన్నదానం



**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి వారి దేవ స్థానంలో ధ్వజ స్తంభం ఏర్పాటు చేసి రెండవ వార్షికోత్సవ సందర్భంగా శనివారం భారీస్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీస్థాయిలో భక్తులు హాజరై ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్ర మానికి ఉభయకర్తలుగా వార్త శ్రీనివాసులు, నరసమ్మ, వార్త వెంకటేశ్వర్లు, పావని,దంపతులు, నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు

## వైసీపీ లీగల్ సెల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

## అలవిగాని హామీలు ఇచ్చి ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది




**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : కోవూరులోని పాటూరు రోడ్డులో ఉన్న వైసీపీ పార్టీ కార్యాలయంలో ప్రతి శనివారం లీగల్ సెల్కు సంబంధించిన న్యాయవాదులు అందుబాటులో ఉంటారని, వైసీపీ పార్టీకి సంబంధించిన కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు న్యాయపరమైన సలహాలు, సూచనలు కావాలంటే వచ్చి వాటిని పరిష్కరించుకోవచ్చని లీగల్ సెల్ నాయకులు శ్యామాచార్యులు, మండల పార్టీ అధ్యక్షుడు అల్లిపల్లి అనూప్రెడి పట్టణ పార్టీ అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డిల్లు, తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కేవలం రెడ్బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వైసీపీ నాయకుల మీద కేసు పెట్టడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా లేనిపోని కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. గత వైసీపీ పాలనలో రైతుల దగ్గర నుంచి చిన్నారులకు మహిళలకు ప్రభుత్వ పథకాలు నేరుగా వారి వారి ఖాతాలో జమ చేసేవారన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రైతులకు భరోసా లేదు.. మహిళలకు ఫ్రీ బస్సు లేదు. సంవత్సర కాలంగా నిరుద్యోగ భృతి లేదు. ఆడబిడ్డలకు ఇస్తామన్న 18000 ఏ పక్కకు వెళ్లాయని ప్రశ్నించారు. కేవలం కల్లబొల్లి మాటలు చెప్పి అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందే తప్ప ఈ కూటమి ప్రభుత్వం సాధించిందేమీ లేదన్నారు. ముఖ్యంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచము అని చెప్పినీ ప్రభుత్వం ప్రసుత్తం తమ ఇష్టానుసారంగా విద్యుత్ చార్జీలు పెంచడం వలన పేద, మధ్య తరగతుల వారు తీవ్ర ఇబ్బందులు పడుతూన్నరన్నారు. ఇప్పటికే ప్రజలు ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గమనిస్తూనే ఉన్నారన్నారు. ఈ దగాకోరు పాలనతో రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అధోగతి పాలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు అదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు రెండు ప్రభుత్వాలను పరిశీలించి గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఏవిధంగా హామీలు అమలు చేశారో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరలా వైసీపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఈ సందర్భంగా వారు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్పే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, లీగల్ సెల్ న్యాయవాదులు బి. చెంచురెడ్డి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, బాలకృష్ణ, కార్యాలయ ఇన్చార్జి కె. ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఏకాంత సేవ ముగిసిన బ్రహ్మోత్సవాలు



**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్ష సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారికి ఏకాంత సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య స్వామి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా నల్లపనేని పెంచలయ్య, సరోజనమ్మ కుమారుడు నల్లపనేని చౌదరి, సుజాత దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు మొలకల శ్రీనివాసులురెడ్డి, పోలుదాసు శ్రీహరి, గాదిరాజు చక్రవర్తి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి చేవూరు కృష్ణప్రసాద్, రుత్వికులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాత: కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జనార్ధనం నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సచివాలయాల పరిధిలో యోగాసనాలు



**బిట్రగుంట జూన్ 14 ప్రభాతవార్త** : బోగోలు మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల పరిధిలో శని వారం అట్టహాసంగా యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగా యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమం లో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## నాడు జగన్ పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి లేదు



**కోవూరు, జూన్ 14 ప్రభాతవార్త** : గత వైసీపీ పాలనలో అరాచకం తప్ప అభివృద్ధి లేదని, అస్తవ్యస్తమైన సకల వ్యవస్థలను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని , రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడింపించేలా చర్యలు చేపట్టారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు ఈ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ను వెయ్యి రూపాయలకు పెంచారని, గత వైసీపీ పాలనలో ఈ వెయ్యి రూపాయలను దశల వారీగా పెంచారన్నారు. గత ప్రభుత్వంలో కుటుంబంలో ఎంతమంది చదువుకున్నా జగన్మోహన్రెడ్డి ఒక్కరికే అమ్మఒడి ఇస్తే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబంలో ఎంతమంది చదువుకుంటున్నా వారికి తల్లికి వందనం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వెంటనే 16347 టీచర్ పోస్టులకు మెగా డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను గత ప్రభుత్వం నిర్లక్షిణ్యంగా మూసివేసిందని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 203 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి పేదవారి ఆకలి తీరుస్తుందన్నారు. గతంలో రైతులకు ధాన్యం తోలిన వెంటనే వారి ఖాతాలో నగదు జమ అయ్యేది కాదన్నారు. నేటి ప్రభుత్వంలో ధాన్యం తోలిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేస్తున్నారన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి 20వేలు ఆర్థికసాయం



**ఆత్మకూరు, జూన్14, ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థినికి డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ ఆర్థికసాయం అందించారు. పట్టణానికి చెందిన కొల్లుకుదురు అశోక్ కుమార్తె జ్ఞానసిరి ఎస్సిఇ కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయసంవత్సరం చదువుతోంది. ఆవిద్యార్థినికి ట్రస్ట్ తరపున డాక్టర్ ప్రణీత్ 20వేలు ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థిని చదువుకు తమ ట్రస్ట్ తరపున సహకారం అందించామని , బాగా చదివి అభివృద్ధిలోకి రావాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్ తోడేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

